కాళేశ్వరం ప్రాజెక్టు కడితే అడ్డుకున్నమా?

- మేం వృథా జలాలు తీసుకుంటే తప్పేంటి?
- బనకచర్ల నిర్మిస్తాం: ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటన
- ఏపీ సీఎం వ్యాఖ్యలపై భగ్గుమంటున్న తెలంగాణవాదులు
- జలరంగ నిపుణుల తీవ్రఅభ్యంతరాలు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ నుంచి నీళ్ల తరలింపుపై మళ్లీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుట్రలకు తెరలేపారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో పచ్చబడ్డ రాష్ట్రాన్ని మళ్లీ ఎండబెట్టే పన్నాగానికి పదునుపెట్టారు. వివాదాస్పదమైన బనకచర్ల పథకాన్ని తెరపైకి తెచ్చారు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని ఒక సభలో మాట్లాడుతూ.. 'తెలంగాణ రాష్ట్రం కాళేశ్వరం కట్టుకుంటే మేం అడ్డుకున్నామా? గోదావరి వృథాజలాల ఆధారంగా బనకచర్ల కట్టుకుంటే తప్పేమిటి?' అంటూ వ్యాఖ్యానించారు. ఏపీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై తెలంగాణవాదులు భగ్గుమంటున్నారు. జలరంగ నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. అసలు గోదావరి బేసిన్‌లో ఉన్నవి మిగులు జలాలేనని, వరద జలాలు ఎక్కడివని ప్రశ్నిస్తున్నారు. గతంలో పలు సందర్భాల్లో గోదావరి ట్రిబ్యునల్ చెప్పిన విషయాలను ఉటంకిస్తున్నారు. కానీ, చంద్రబాబు మాత్రం ట్రిబ్యునల్ ఉత్తర్వులు ఉల్లంఘిస్తూ బనకచర్లపై ముందుకెళ్తున్నారని ఆక్షేపిస్తున్నారు. ఒకవేళ, ఏపీ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును నిర్మించాలనుకుంటే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తెలంగాణ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని జలరంగ, న్యాయ నిపుణులు చెప్తున్నారు. తెలంగాణ ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పించి పర్మిషన్ వచ్చిన తర్వాతే ముందుకెళ్లాల్సి ఉంటుందని స్పష్టంచేస్తున్నారు. కేటాయింపులేని వరద జలాలను సాకుగా చూపి మన నీళ్లను తీసుకెళ్లేందుకు యత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాళేశ్వరం కట్టుకుంటే తాము అడ్డుకోలేదంటూ అక్కసు వెళ్లగక్కారని తెలంగాణవాదులు భగ్గుమంటున్నారు. చంద్రబాబు కుట్రలపై తెలంగాణ సర్కారు ఉదాసీనంగా వ్యవహరించవద్దని, వెంటనే కేంద్రానికి ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో పాతిరెడ్డిపాడు ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం చేయడంతో ఇప్పుడు తెలంగాణ ప్రజలు నీళ్ల కోసం అల్లాడే పరిస్థితి వచ్చిందని చెప్తున్నారు. ఇప్పుడు కూడా రాజకీయ అవసరాల కోసం తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెడితే ఊరుకోబోమని హెచ్చరిస్తున్నారు.

సీమ లిఫ్ట్ సక్రమమేనట!

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల అక్రమమట!

- ఏపీ సర్కారు అడ్డగోలు వాదన
- ఎన్జీటీలో కౌంటర్ దాఖలు
- అయినా సీఎం రేవంత్ సైలెంట్

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వం మొండి వైఖరి వీడటం లేదు. అది అక్రమ ప్రాజెక్టు కాదని, పాత ప్రాజెక్టేనని, దాని నిర్మాణానికి ఎలాంటి పర్యావరణ అనుమతి అవసరం లేదని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ మంగళవారం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో కౌంటర్ దాఖలు చేశారు. తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులకు అనుమతులు లేవని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ, పర్యావరణ అనుమతులు లేకుండా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను చేపడుతున్నారని తెలంగాణకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ ఎన్జీటీలో పిటిషన్ వేయడంతో ఏపీ సీఎస్ ఈ కౌంటర్ దాఖలు చేశారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతి తర్వాతే కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఏపీ సర్కారు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు 3 టీఎంసీల నీటిని ఎత్తిపోసే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం కోసం 2020 మే 5న జీవో 203 జారీ చేసింది.

సీఎం రేవంత్‌రెడ్డి మౌనం

తెలంగాణపై ఏపీ ఎన్ని ఆరోపణలు చేస్తున్నా, అక్రమంగా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మిస్తున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నది. ఏపీ సీఎం చంద్రబాబు వైఖరిని ఎండగట్టాల్సిన రేవంత్ రెడ్డి మౌనం వహించడంతో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతూనే ఉన్నది. కేసీఆర్ హయాంలో ఈ ప్రాజెక్టు నిర్మాణంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఆ ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటాయని పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నది. పర్యావరణ అనుమతులు లేని రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించొద్దని 2021 డిసెంబర్ 17న ఎన్జీటీ తీర్పు ఇవ్వడంతో ఏపీ ప్రభుత్వ ఆ పనులను తాత్కాలికంగా నిలిపివేసింది. కానీ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడంతో ఏపీ సర్కారు వేగంగా ఆ ప్రాజెక్టును పూర్తి చేస్తోంది. దీంతో ఆ పనులను అడ్డుకోవాలని రేవంత్‌రెడ్డి సర్కారు కంటితుడుపు చర్యగా కేంద్రానికి, కేఆర్ఎంబీకి లేఖలు రాసి చేతులు దులుపుకున్నది. ఓవైపు సొంత జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కనపెట్టిన రేవంత్‌రెడ్డి మరోవైపు రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుపై అభ్యంతరం చెప్పకపోవడంపై అనుమానాలొస్తున్నాయి.

రేవంత్ సర్కారు తక్షణమే స్పందించాలి..

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం అక్రమం కాదని, అది పాత ప్రాజెక్టేనని, దానికి ఎలాంటి పర్యావరణ అనుమతి అవసరం లేదని ఏపీ కౌంటర్ దాఖలు చేయడం దారుణం. ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసిన ఏపీ.. తెలంగాణలో నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు అనుమతి లేదని ఆరోపించడం విడ్డూరం. పర్యావరణ అనుమతులు ఉంటేనే కొత్త ప్రాజెక్టు కట్టాలని గతంలో ఎన్జీటీ స్పష్టం చేసినప్పటికీ ఏపీ మొండి వైఖరి వీడటం లేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై వెంటనే స్పందించాలి.

- గవినోళ్ల శ్రీనివాస్, ఎన్జీటీలో పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తి

మంగళవారం ఎర్రవెల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సాయిబాబా చిత్రపటాన్ని అందజేస్తున్న కోలేటి దామోదర్‌గుప్తా

అపర భగీరథుడికి రుణపడి ఉంటాం

- 'సీతారామ' నీళ్ల రాకతో అన్నపురెడ్డిపల్లి రైతుల హర్షం
- పాలు, గోదావరి జలాలతో కేసీఆర్ ఫ్లెక్సీకి అభిషేకం

అన్నపురెడ్డిపల్లి, మార్చి 4: 'అపర భగీరథుడు.. కేసీఆర్'కు ఆజన్మాంతం రుణపడి ఉంటామని అన్నపురెడ్డిపల్లి మండల రైతులు పేర్కొన్నారు. కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సీతారామ ప్రాజెక్టు నీళ్లు తమ పంట పొలాలకు చేరడం పట్ల భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల రైతులు హర్షం వ్యక్తంచేశారు. సీతారామ ప్రాజెక్టులో భాగంగా ఉన్న ములకలపల్లి మండలం కమలాపురం పంపుహౌస్-3 నుంచి సోమవారం రాత్రి అధికారులు తొలిసారిగా సాగునీటిని విడుదల చేశారు. ఆ నీళ్లు సీతారామ కాలువ ద్వారా మంగళవారం అన్నపురెడ్డిపల్లి మండలానికి చేరుకున్నాయి. తమ పంట పొలాల్లోకి చేరిన గోదావరి జలాలను తాకి ఆయా గ్రామాల రైతులు మురిసిపోయారు. నర్సాపురం రెవెన్యూలోని రైతులు కాలువలోని గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే కేసీఆర్ ఫ్లెక్సీకి పాలు, గోదావరి జలాలతో అభిషేకం చేశారు. 'జై కేసీఆర్.. జైజై కేసీఆర్..' అంటూ నినాదాలు చేశారు.

భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం నర్సాపురంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

ఎన్వోసీ జారీ అధికారం కలెక్టర్లకు ఎక్కడుంది?

- సీఎస్ వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): భూమికి సంబంధించి నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) జారీచేసే అధికారం కలెక్టర్లకు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. లేని అధికారాన్ని కలెక్టర్లు ఎలా వినియోగిస్తారని ప్రశ్నించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్ నౌకల్సా గ్రామం ప్రశాంతి హిల్స్‌లోని 66/2 సర్వే నంబర్‌లో 200 చదరపు గజాల ప్లాట్‌కు 2023 సెప్టెంబర్ 9న కలెక్టర్ ఎన్వోసీ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ ఆళ్లగడ్డ చెన్నమ్మ హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు.

చిట్‌ఫండ్ కేసులో నలుగురి అరెస్టు

- 70 కోట్లు కొల్లగొట్టిన కేటుగాళ్లు
- ఏకంగా 1,300 మందికి టోకరా

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): చిట్‌ఫండ్ పేరిట హైదరాబాద్‌లో 1,300 మందిని మోసగించి, రూ.70 కోట్లు కొల్లగొట్టిన నలుగురిని సీఐడీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుల్లో చవ్వా కుమార్ (50), చవ్వా యాదగిరి (62), చవ్వా చిన్న ఇస్తారి (60), చవ్వా వెంకటేశ్ (58) ఉన్నారు. నల్లకుంటకు చెందిన పాశం వేణుగోపాల్‌రెడ్డి 2022లో చేసిన ఫిర్యాదు మేరకు ఈ అరెస్టులు జరిగాయి. వీరంతా శంకర్‌పల్లిలో వీరభద్రీయ పరపతి సహకార సంఘం పేరిట చిట్‌ఫండ్ వ్యాపారాన్ని నడిపారు. వీరి చేతిలో మోసపోయినవారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విచారణకు సహకరించాలని అధికారులు కోరారు.

రైతుల గోస పట్టదా?

15 నెలల్లో 440 మందికిపైగా రైతుల ఆత్మహత్య

పది వేల కోట్లు తెచ్చిన ప్రభుత్వానికి 750 కోట్లు రైతుబీమా ప్రీమియం చెల్లించడానికి మనసు వస్తలేదు

ఇరిగేషన్, వ్యవసాయ, విద్యుత్తు మంత్రులు పొలాలకు వెళ్లాలి ● రైతులకు భరోసా ఇవ్వాలి: నిరంజన్‌రెడ్డి

- వర్షాలు పడి పుష్కలంగా నీళ్లున్నా నిర్వహణలో వైఫల్యం
- బాధలను దిగమింగాలి కానీ ఆత్మహత్యలకు పాల్పడవద్దు
- రైతులకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు కోతలకు తోడు, సాగునీరు అందక పచ్చని పంటలు కండ్లముందే ఎండిపోతున్నా కాపాడుకోలేపోతున్న రైతుల గోసను, ఆవేదనను రేవంత్‌రెడ్డి సర్కారు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నేత, వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు కుదవబెట్టి పది వేల కోట్లు తెచ్చిన ప్రభుత్వానికి రూ.750 కోట్లు రైతుబీమా ప్రీమియం చెల్లించడానికి ఎందుకు మనసు రావడం లేదు? అని నిలదీశారు. తెలంగాణభవన్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'రైతు ఏ కారణంచేత మరణించినా రూ.5 లక్షల పరిహారం అందించేలా కేసీఆర్ ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని రూపొందించింది. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేలా దీన్ని తీర్చిదిద్దింది. రైతు చనిపోయిన ఏడు పనిదినాల్లో ఆ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందేది. రైతుబీమా, రైతుబంధు ప్రపంచంలోనే అత్యుత్తమ పథకాలని ఐక్యరాజ్య సమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సంస్థ ప్రశంసించింద'ని గుర్తుచేశారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి. చిత్రంలో మెతుకు ఆనంద్

వ్యవసాయ హామీలు అమలుకావట్లేదు

కాంగ్రెస్ అభయహస్తం కింద ఇచ్చిన హామీలను రేవంత్ సర్కారు అమలుచేయడం లేదని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. 'ప్రభుత్వ భూములను కుదువపెట్టి రైతుభరోసా కోసమని రూ.10 వేల కోట్లు తెచ్చి రెండు నెలలు అవుతున్నది. అయినా మూడెకరాల వరకు నిధులు పడలేదు. మూడెకరాల వరకు రైతుభరోసా ఇచ్చామని వ్యవసాయ మంత్రి చెప్తుంటే, డబ్బులు వేయాల్సి ఉందని ఉప ముఖ్యమంత్రి చెప్తున్నారు. మంత్రుల మధ్య సమన్వయమే లేదు. పంటలు వేసుకున్న తర్వాత రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో రైతులు పంటలు వేసుకోవద్దని చెప్పించారు. ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రి, నీటి పారుదలశాఖ మంత్రి చెప్పకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో సాగునీళ్లకు కొరత లేదని చెప్పించారు. నీటికి, కరెంటుకు సమస్య లేకుంటే రైతులు ఎందుకు ఆందోళన చెందుతున్నట్టు? పంటలు పశువులకు మేత ఎందుకు అవుతున్నట్టు? ప్రభుత్వం సాగునీటి మీద సమీక్ష ఎందుకు చేయలేదు? ఇరిగేషన్, వ్యవసాయ, విద్యుత్ శాఖల మంత్రులకు ధైర్యముంటే పంటలు ఎండుతున్న పొలాల వద్దకు వెళ్లి రైతులను కలవాలి. రాష్ట్రంలో పంటలు ఎండ టం లేదని ప్రభుత్వం ప్రకటించాలి' అని డిమాండ్ చేశారు. 'రాష్ట్రంలో సమృద్ధిగా వాన లు పడి, పుష్కలంగా నీళ్లున్నా నీటి నిర్వహణలో ప్రభుత్వం విఫలమైంది. కరెంటు, సాగునీరు, రైతుభరోసా ఇవ్వని కారణంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రైతాంగం బాధలను దిగమింగాలి కా నీ ఆత్మహత్యలకు పాల్పడవద్దు' అని విజ్ఞప్తి చేశారు. సమయం వచ్చినప్పుడు రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

> పది వేల కోట్లు తెచ్చిన ప్రభుత్వానికి రూ.750 కోట్లు రైతుబీమా ప్రీమియం చెల్లించడానికి ఎందుకు మనసు రావడం లేదు? ఇది రైతు అనుకూల ప్రభుత్వమా? రైతుబీమాను ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నది.
>
> - నిరంజన్‌రెడ్డి

7,000 కుటుంబాలకు అందని పరిహారం

'రైతుబీమా పథకం ప్రవేశపెట్టిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే వరకు వివిధ కారణాలతో రాష్ట్రంలో 1,18,197 మంది రైతులు మరణించగా ఆ రైతు కుటుంబాలకు రూ.5,909.85 కోట్లు పరిహారంగా అందాయి. రైతుబీమా పథకం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.6,122.65 కోట్లు ఎల్ఐసీకి ప్రీమియంగా చెల్లించింది. ఏడాదికి రూ.1,500 కోట్లకు గాను, రెండో విడత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.750 కోట్ల ప్రీమియం చెల్లించని కారణంగా ఏడు వేలపై చిలుకు రైతు కుటుంబాల పరిహారం పెండింగ్‌లో ఉన్నది. 15 నెలల కాంగ్రెస్ పాలనలో 440 మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు' అని నిరంజన్‌రెడ్డి తెలిపారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం
1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068,
ఫోన్ నం.లు 040-29803086/3186,
ఇ-మెయిల్ : ol.hyderabad@mca.gov.in

ఫారం నెం.63
(రూల్ 148(1) చూడండి)
గౌరవనీయ తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో: హైదరాబాద్ వద్ద (ప్రారంభ అధికారపరిధి)
కంపెనీల చట్టం, 1956 విషయంలో
మరియు
M/s. శక్తి సాయి ఫ్లవర్స్ & టిష్యూస్ పబ్లిక్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో
కంపెనీ పిటీషన్ నం. 174/2001
తమ క్లెయింను నిరూపించుటకు క్రెడిటార్లకు (కార్మికులతో సహా) నోటీస్ ప్రకటన

పైన తెలిపిన కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) యొక్క క్రెడిటార్లకు (కార్మికులతో సహా) తెలియజేయునదేమనగా కంపెనీల చట్టం, 1956 సెక్షన్ 530 క్రింద ప్రాధాన్యం ఇచ్చుటకు వారి సంబంధిత పేర్లు, చిరునామాలు మరియు డెట్ లేదా క్లెయిం మరియు ఏదేని టైటిల్ వివరాలతో నిర్ణీత ఫారంలో సదరు డెట్ లేదా క్లెయింను నిరూపించు అఫిడవిట్‌తో, **04 ఏప్రిల్ 2025న లేదా ఆలోగా అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం, 1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068** వద్ద బట్వాడా లేదా సదరు తేదీలోగా అతనికి చేరువిధంగా అఫీషియల్ లిక్విడేటర్‌కు పోస్ట్ ద్వారా పంపించి పైన తెలిపిన కంపెనీపై వారి సంబంధిత డెట్స్ లేదా క్లెయింలను రుజువులను తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం యొక్క అఫీషియల్ లిక్విడేటర్‌కు దాఖలు చేయవలసిందిగా వారికి తెలియజేయడమైనది. ఎవరేని క్రెడిటార్ పైన తెలిపిన విధంగా పరిమిత కాల వ్యవధిలోగా అతని/ ఆమె/ వారి అఫిడవిట్ రుజువును దాఖలు చేయుటలో విఫలమైతే అతని/ఆమె/వారి డెట్ రుజువు ముందు లేదా సందర్భాన్ని బట్టి సదరు పంపిణీ నుండి డివిడెండ్ పంపిణీ ప్రయోజనం నుండి మినహాయించబడును.

అఫీషియల్ లిక్విడేటర్ నుండి వ్రాతపూర్వకంగా నోటీస్ ద్వారా అతని/ ఆమె/ వారి రుజువును పంపిన ఎవరేని క్రెడిటార్ (కార్మికులతో సహా) స్వయంగా లేదా అతని/ఆమె/వారి అడ్వకేట్ ద్వారా సదరు నోటీస్‌లో తెలిపిన సదరు సమయం మరియు ప్రదేశం వద్ద సదరు డెట్ లేదా క్లెయిం విచారణకు హాజరు కావలెను మరియు అతని/ఆమె/వారి డెట్ లేదా క్లెయింకు అవసరమైన తదుపరి సాక్ష్యాలను దాఖలు చేయవలెను.

తేది: 28 ఫిబ్రవరి 2025

సం/-
(U.K.సాహూ, ICLS)
అఫీషియల్ లిక్విడేటర్,
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్

గమనిక: నోటరీ చేయబడిన రూ.20/- నాన్-జుడీషియల్ స్టాంప్ పేపర్‌పై కంపెనీల (కోర్టు) రూల్స్, 1959 లోని రూల్ 151, 152 మరియు ఇతర వర్తించు రూల్స్ క్రింద మద్దతునిచ్చే డాక్యుమెంట్లతో సహా సందర్భాన్ని బట్టి ఫారం నెం.66 లేదా ఫారం నెం.67లో క్లెయింను దాఖలు చేయవలెను.

ఖమ్మంలో ఏర్పాటుచేసిన సెమినార్‌లో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త శరత్‌బాబు. చిత్రంలో ఎమ్మెల్సీ తాతా మధు

పాలకుల వల్లే మిర్చి ధరల పతనం

- రైతుల వ్యథను ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి
- రైతు సంఘం సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్త శరత్‌బాబు
- రైతుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం: ఎమ్మెల్సీ తాతా మధు

రఘునాథపాలెం, మార్చి 4: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పిదం వల్లే మిర్చి ధరలు పతనమైనట్టు వ్యవసాయ శాస్త్రవేత్త శరత్‌బాబు స్పష్టం చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రధానమైన మిర్చి ఎగుమతులపై ప్రభుత్వాలు చొరవ చూపకపోవడంతోనే ఈ ఏడాది మిర్చి ధరలు భారీగా తగ్గినట్టు తెలిపారు. నిరుడు పండించిన మిర్చి పంట పెద్ద మొత్తంలో నిల్వ ఉండటం, ప్రపంచ వ్యాప్తంగా మిర్చి దిగుమతి చేసుకునే దేశాల్లో పలు సంక్షోభాలు ఏర్పడటం వంటివి కూడా మరికొన్ని కారణాలని ఆయన పేర్కొన్నారు. 'మిర్చి ధరల పతనం – పరిష్కార మార్గం' అనే అంశంపై తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జడ్పీ మీటింగ్ హాల్లో మంగళవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. దేశం దిగుమతి సుంకాన్ని పెంచిందనే కారణంతో కొన్ని దేశాలకు ఎగుమతులు నిలిచిపోయినట్టు తెలిపారు. దీనికితోడు ఈ ఏడాది తామరపురుగు, చీడపీడల వల్ల మిర్చి దిగుబడి కూడా చాలా వరకు తగ్గిందని అన్నారు.

రైతుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం

ఐక్య పోరాటాలతోనే వ్యవసాయ రంగ సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది మిర్చి సాగు చేసిన రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేసి క్వింటాకు రూ.25 వేల చొప్పున నాఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దొండపాటి రమేశ్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, రైతు సంఘాల నాయకులు బాగం హేమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
ప్రవేశం ఉచితం

లక్షల మందిని చేరుకునే సలక్షణ వేదిక
అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న
కరీంనగర్ మహానగరం, పరిసర ప్రాంతాల్లో
అన్ని ప్రముఖ సంస్థల ప్రాపర్టీలు ఒకే వేదికపైన
మరియు తక్షణ రుణ సదుపాయం కొరకు
ప్రముఖ జాతీయ బ్యాంకులు కూడా
అదే వేదికపై అందుబాటులో ఉంటాయి.
8 & 9 మార్చి, 2025
వేదిక: శ్రీ రాజ రాజేశ్వర కళ్యాణ మండపం, కోర్టు చౌరస్తా, కరీంనగర్.
Digital Partner STV
TV Partner T NEWS

In Association with :
Century | OSMANI ASSOCIATES ARCHITECTS, ENGINEERS & BUILDERS SOPHISTICATED DESIGNERS | OSMANI CONSTRUCTIONS PVT.LTD | VEKA Smart Window Solutions UPVC Windows and Doors Knr. Cell: 9505310000,9000224322 | VAISHNAVI enhancing lifestyles | VYSHU Vision Securities SALES & SERVICE C.C. Camera's & all Security Solutions | Developers swaraj Builders
SONY SOLAR POWER Back Side Satyanarayana Swamy Temple, Ramnagar, Karimnagar | MAHA CEMENT BUILD IT STRONG | SAI SHRADDHA INFRA | SUGUNA DEVELOPERS YOUR HOME. OUR COMMITMENT. | UPVC ROOFS | बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda | KK ENTERPRISES All Types of Solar Material Available | KDCCB

Booking Enquiry: 9182777571, 9182777022